andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 40.3, కనిష్ఠం 28.5



నిర్మల్
జిల్లా వార్తలు

బుధవారం 22 మే 2024

అసాంఘిక కార్యకలాపాలపై కొరడా



జిల్లా ఎస్పీ డా.జానకి షర్మిల





బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న దృశ్యం (ఫైల్)

- జూదంపై సీరియస్
- వరుస దాడులతో జూదరుల బెంబేలు
- రాజకీయ నేతలను సైతం వదిలిపెట్టని వైనం
- ఇప్పటికే గంజాయి నిరోధానికి పకడ్బందీ చర్యలు
- వ్యభిచార ముఠాలపైనా నజర్

నిర్మల్, మే 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు అసాంఘిక కార్యకలాపాల నిరోధానికి జిల్లా ఎస్పీ డా.జానకీ షర్మిల కొరడా ఝులిపిస్తున్నారు. ఇప్పటికే గంజాయి అక్రమ సరఫరా, వినియోగంపైనా పకడ్బందీ చర్యలు చేపడుతున్న ఎస్పీ కొద్దిరోజుల నుంచి పేకాటజూదంపై కొరడా ఝులిపిస్తున్నారు. జిల్లాలో గత కొన్ని సంవత్సరాల నుంచి విచ్చలవిడిగా పేకాట, జూదం కొనసాగుతున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ జూదం కారణంగా వందలాది కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. అయితే జూదం వల్ల నష్టపోయిన కుటుంబాల్లోని కొంతమంది మహిళలు ఇటీవలే ఎస్పీకి లేఖల ద్వారా తెలిపారు. అప్పటికే ఈ దిశగా అనేక ఫిర్యాదులు అందుకున్న ఎస్పీ ఇక వ్యూహాత్మకంగా సిబ్బందిని రంగంలోకి దించారు. గతవారం రోజుల నుంచి ఫాంహౌజ్‌లు, తోటలు, గ్రామశివారుల్లో కొనసాగుతున్న జూదంపై దాడులు చేపట్టారు. ఇందులో భాగంగా సుమారు 50 మందికి పైగా జూదరులను పోలీసులు అరెస్టు చేయడమే కాకుండా వారి నుంచి పెద్ద మొత్తంలో నగదు, సెల్‌ఫోన్‌లు, వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఆ తరువాత జిల్లాకేంద్రంలో గుట్టు చప్పుడు కాకుండా సాగుతున్న బడా రాజకీయ నేతల జూదంపై ఎస్పీ షర్మిల దృష్టి కేంద్రీకరించారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా ఇక్కడి పలులాడ్జీలు, బ్యాంకెట్‌హాల్స్, ఫాంహౌజ్‌ల్లో సాగుతున్న జూదంపై ఆకస్మికదాడులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే ఆదివారం రాత్రి పట్టణ నడిబొడ్డున గల ఓ లాడ్జీలోని పేకాటస్థావరంపై పోలీసులు పంజా విసిరారు. ఈ దాడిలో ప్రధానపార్టీలకు చెందిన ముఖ్యనేతలు సైతం ఉన్నప్పటికీ ఎస్పీ ఒత్తిళ్లను పక్కనపెట్టి వారందరినీ అరెస్టు చేయడం కలకలం రేపుతోంది. అలాగే భైంసా, బాసర, ఖానాపూర్‌లతో పాటు తదితర ప్రాంతాల్లో కొనసాగుతున్న పేకాటస్థావరాలను సైతం పోలీసులు పసిగట్టి దాడులకు శ్రీకారం చుట్టారు. పేకాటతో పాటు గుట్టు చప్పుడు కాకుండా శివారు ప్రాంతాల్లోని కొన్ని ఇండ్లల్లో కొనసాగుతున్న వ్యభిచారదందాపై కూడా ఎస్పీ సీరియస్‌గా ఫోకస్ పెట్టారని అంటున్నారు. జిల్లాలో గంజాయితో పాటు ఇతర డ్రగ్స్ నిరోధానికి గత కొద్దిరోజుల నుంచి పోలీసుశాఖ ద్వారా ఎస్పీ విస్తృత అవగాహన కార్యక్రమాలను నిర్వహింపజేస్తున్నారు. కార్డన్‌సెర్చ్, సోషల్‌కాంటాక్ట్ లాంటి కార్యక్రమాలను నిర్వహిస్తూ జనాలకు అసాంఘిక కార్యకలాపాలు, చట్ట నిరోధకమైన పనులపై అవగాహన కల్పిస్తున్నారు. ఇటీవలే జిల్లాలో జరిగిన లోక్‌సభ ఎన్నికల సందర్భంగా సమస్యాత్మక ప్రాంతాల్లో చిన్న సంఘటన కూడా జరగకుండా ఎస్పీ పకడ్బందీ చర్యలు చేపట్టి ప్రశంసలు అందుకున్నారు. అలాగే మహిళలు, పిల్లలు, అమాయక జనాలకు ఆమె తన కార్యాలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు అపాయింట్‌మెంట్‌లు ఇస్తూ వారి సమస్యలను వినడమే కాకుండా ఆ సమస్యల పరిష్కారానికి అక్కడికక్కడే చర్యలు తీసుకుంటుండడం ప్రాధాన్యతను చేకూరుస్తోందంటున్నారు.

జూదంపై సీరియస్‌గా చర్యలు

జిల్లాలో కొనసాగుతున్న పేకాటజూదంపై ఎస్పీ జానకీషర్మిల సీరియస్‌గా స్పందిస్తున్నారు. నిర్మల్‌తో పాటు సరిహద్దున ఉన్న బాసర, భైంసాలలో పేకాటస్థావరాలు పెద్దఎత్తున కొనసాగుతున్నట్లు ఎస్పీ గుర్తించారు. ఇక్కడ జరిగే పేకాటజూదంలో పాల్గొనేందుకు మహారాష్ట్ర వాసులే కాకుండా నిజామాబాద్, జగిత్యాల్, కామారెడ్డిలతో పాటు తదితర జిల్లాల నుంచి కూడా పేకాట జూదరులు ఇక్కడికి వస్తుంటారు. వారంతా ఇక్కడి లాడ్జీలు, ఫాంహౌజ్‌లు, శివారుతోటల్లోని స్థావరాల్లో వేల రూపాయల జూదాన్ని ఆడుతుంటారని చెబుతున్నారు. అయితే కొంతమంది పేకాట జూదరులు ముఠాగా ఏర్పడి ఇక్కడ పెద్ద ఎత్తున స్థావరాలను ఏర్పాటు చేస్తున్నారన్న ప్రచారం ఉంది. ఈ పేకాట స్థావరాల్లో హైటెక్ సౌకర్యాలను సమకూరుస్తున్నారంటున్నారు. ఏసీ సౌకర్యంతో పాటు మందు, విందు లాంటి ఖరీదైన సౌకర్యాలను సమకూర్చి జూదరులను రప్పిస్తున్నారని చెబుతున్నారు. ప్రతీరోజూ జిల్లాలో లక్షల రూపాయల్లో పేకాటజూదం కొనసాగుతున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ పేకాటజూదంలో రాజకీయ నేతలు కూడా పాత్రదారులేనని చెబుతున్నారు. అయితే జూదంపై పోలీసులు అడపాదడపా నామమాత్రపు చర్యలు తీసుకుంటున్నారే తప్ప సీరియస్‌గా చర్యలు తీసుకోకపోవడంతో నిర్వహకులు, జూదరుల్లో ఎలాంటి భయం లేకుండా పోయిందంటున్నారు. దాడులు జరిగినా రెండు,మూడు రోజుల వరకు వారంతా మౌనంగానే ఉండి మళ్లీ తమదందాను యథేచ్ఛగా సాగిస్తున్నారంటున్నారు. అయితే ఎస్పీ జానకీషర్మిల గతానికి భిన్నంగా పేకాట జూదం ఆడుతున్న రాజకీయ నేతలనే టార్గెట్‌గా చేసుకొని దాడులు కొనసాగిస్తుండడం చర్చకు తావిస్తోంది. ఇక నుంచి జూదంపైనా అలాగే నిర్వహకులపైనా వీటి స్థావరాలపైనా గట్టి నిఘా సారించి కఠిన చర్యలు తీసుకోబోతున్నట్లు ఎస్పీ జారీ చేసిన హెచ్చరికలు అంతటా దుమారం రేపుతున్నాయి.

ఇప్పటికే గంజాయిపైన..

జిల్లాలో గంజాయి వినియోగంతో పాటు అమ్మకాలు, ఎగుమతి, దిగుమతులు, సాగు పెరిగిపోయిన విషయాన్ని ఎస్పీ సీరియస్‌గా పరిగణలోకి తీసుకున్నారు. గత కొద్దిరోజుల నుంచి ఎస్పీ గంజాయిపై గట్టి నిఘాను పెంచి కొంతమంది సిబ్బందిని ప్రత్యేకంగా రంగంలోకి దించారు. దీని కారణంగా గంజాయి చాలాసార్లు పట్టుబడడమే కాకుండా వినియోగదారులు సైతం పోలీసులకు దొరికిపోయారు. గంజాయి వినియోగదారులకు ఎస్పీ ప్రత్యేకంగా కౌన్సిలింగ్‌లు నిర్వహింపజేసి దాని వినియోగం కారణంగా జరిగే అనార్థాలను వివరింపజేశారు. దీంతో పాటు గంజాయిని జిల్లాకు తరలిస్తున్న వారిపై గట్టి నిఘా పెట్టారు. పొరుగు జిల్లాల్లో రికార్డుల్లోకి ఎక్కిన గంజాయి స్మగ్లర్ల వివరాలు అలాగే వారి వాహనాల వివరాలను తెలుసుకుంటూ సరిహద్దుల్లో గట్టి నిఘాను ఏర్పాటు చేశారు. దీనికి అనుగుణంగా ఇప్పటికే పలు వాహనాల్లో జిల్లాకు తరలిస్తున్న గంజాయిని పోలీసులు సరిహద్దుల్లోనే పట్టుకున్న సంగతి తెలిసిందే. అలాగే నిర్మల్, భైంసా, ఖానాపూర్ ప్రాంతాల్లో గంజాయిని విక్రయిస్తున్న వారిపై కూడా పోలీసులు నిఘా సారించి చర్యలు చేపట్టారు. గంజాయితో పాటు ఇతర ప్రమాదకరమైన డ్రగ్స్ అమ్మకాలపై కూడా ఎస్పీ దృష్టి కేంద్రీకరిస్తున్నారు.

వ్యభిచారంపైనా ఉక్కుపాదం..

జిల్లాలోని కొన్నిలాడ్జిల్లో రహస్యంగా సాగుతున్న వ్యభిచారంపై కూడా ఎస్పీ దృష్టి పెట్టారు. ఇటీవల బాసర ప్రాంతంలోని కొన్నిలాడ్జిల్లో జరుగుతున్న వ్యభిచారం దందాపై పోలీసులు రహస్యంగా దాడులు నిర్వహించిన సంగతి తెలిసిందే. అలాగే లాడ్జిలతో పాటు శివారు ప్రాంతాల్లోని కొన్ని ఇళ్లల్లో వ్యభిచారం గుట్టు చప్పుడు కాకుండా సాగుతున్నట్లు ఎస్పీకి పలు ఫిర్యాదులు అందాయి. దీంతో ఎస్పీ ఈ దందా నిరోధానికి ప్రత్యేకబృందాలను రంగంలోకి దించి నిఘా విస్తృతం చేసినట్లు సమాచారం. మొత్తానికి జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు అసాంఘిక కార్యకలాపాల నిరోధానికి ఎస్పీ చేపడుతున్న చర్యలు ప్రశంసలు అందుకుంటున్నాయని చెబుతున్నారు.

వైభవంగా లక్ష్మీ నరసింహస్వామి కల్యాణం



స్వామివారి కల్యాణ మహోత్సవం..హాజరైన మహిళలు

ముథోల్, మే 21 : మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో గల శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవం మంగళవారం గ్రామస్థుల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా వేదపండితులు వైభవ్‌శర్మ, సాయికృష్ణ, బసవరాజు నేతృత్వంలో పూజలు నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం లక్ష్మీదేవి సహస్ర కుంకుమార్చన అనంతరం శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కల్యాణ మహోత్సవం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో భక్తులు, గ్రామస్థులు, తదితరులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



లోకేశ్వరంలో స్వామివారి కల్యాణం

లోకేశ్వరం : మండలంలోని నగర్ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం రమణీయంగా సాగింది. మంగళవారం ఆలయ ఆవరణలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేకపూజా కార్యక్రమాలు, అలాగే హోమం నిర్వహించారు. లక్ష్మీనరసింహస్వామి కల్యాణానికి వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. అనంతరం ఆలయ కమిటీ దాత కొమ్ముల మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

జయంతి ఉత్సవాలకు

ముస్తాబైన నరసింహస్వామి ఆలయం



లక్ష్మీ నరసింహస్వామి విగ్రహం

భైంసా, మే 21 : పట్టణంలోని నర్సింహ నగర్ కాలనీ పరిధిలోని శ్రీలక్ష్మీ నరసింహ ఆలయం బుధవారం జరిగే జయంతి ఉత్సవాల కోసం గాను సర్వాంగ సుందరంగా ముస్తాబు అయ్యింది. ఆలయ నిర్వాహక కమిటీ సభ్యులు జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు గాను ఏర్పాట్లు చేపట్టారు. వేకువ జాము వేళలో విగ్రహ అభిషేకంతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. అనంతరం ఆలయంలో యాగం, ఇతర ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి ఆలయ నిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం జరుగనుంది.

నిర్మల్ సీనియర్ సివిల్ న్యాయాధికారిగా

బాధ్యతలు స్వీకరించిన రాధిక



సన్మానిస్తున్న న్యాయమూర్తి, న్యాయవాదులు

నిర్మల్ కల్చరల్, మే 21 : నిర్మల్ సీనియర్ సివిల్ జడ్జిగా జి. రాధిక మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ న్యాయాధికారి ఆర్. అజయ్‌కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లూరి మల్లారెడ్డి, సభ్యులు సన్మానించారు. ఉపాధ్యక్షురాలు కవిత, జనరల్ సెక్రటరీ ఓస మహేందర్, ఏ. నర్సారెడ్డి, సిహెచ్. అర్చన, న్యాయవాదులు శుభకరణ్, గోవర్ధన్, డి. రాజశేఖర్, నూనె గంగాధర్, రాజలింగం, పి. అశోక్, తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పనుల్లో నాణ్యత పాటించాలి : డీపీవో శ్రీనివాస్



సాంగ్వీలో నర్సరీని పరిశీలిస్తున్న డీపీవో శ్రీనివాస్

దిలావర్‌పూర్, మే 21 : పాఠశాలల్లో చేపడుతున్న అమ్మ ఆదర్శ పథకం పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని డీపీవో శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని బన్సపల్లి, సాంగ్వి గ్రామాల్లో అమ్మ ఆదర్శ పనులు, సెగ్రిగేషన్, నర్సరీలను పరిశీలించారు. ఎండ నుంచి మొక్కలను రక్షించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అమ్మ ఆదర్శ పథకం పనుల్లో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. డీపీవో వెంట ఎంపీవో అజీజ్ ఖాన్, ఏపీవో దివ్య రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ యూనిఫామ్ స్టిచ్చింగ్ సెంటర్‌ను సందర్శించిన డీఈవో



కుట్టిన యూనిఫామ్‌లను పరిశీలిస్తున్న డీఈవో

దిలావర్‌పూర్, మే 21 : మండల కేంద్రంలోని స్కూల్ యూనిపామ్ స్టిచ్చింగ్ సెంటర్‌ను మంగళవారం జిల్లా విద్యా శాఖ అధికారి రవీందర్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల కొలతలకు అనుగుణంగా యూనిపామ్ స్టిచ్చింగ్ చేయాలని సూచించారు. డీఈవో వెంట ఎంఈవో శంకర్, ఐకేపీ ఏపీఎం సులోచన రెడ్డి, లోలం, మాయాపూర్ స్కూల్ హెడ్ మాస్టర్లు రాజేశ్వర్, అమృత్, సీఆర్‌పీ గంగన్న ఉన్నారు. డ్వాక్రా సంఘాల అధ్యక్షులు సీసీ ముత్యం, వివోఏలు, టైలర్ మాస్టర్స్, కటర్స్ పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల పనుల్లో నాణ్యత పాటించాలి



పాఠశాల పనులు పరిశీలిస్తున్న కలెక్టర్

కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



ధాన్యం కొనుగోలు కేంద్రం సందర్శించిన కలెక్టర్

నిర్మల్ కల్చరల్, మే 21 : జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులు నాణ్యత ప్రమాణాలు పాటించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎన్టీఆర్ మినీ స్టేడియంలోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. పాఠశాల పునఃప్రారంభానికల్లా పూర్తికావాలన్నారు. విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లకు నీటి సరఫరా తదితర పనులు చేయాలన్నారు. విద్యాశాఖ అధికారులు పనులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. సోఫీనగర్‌లోని గురుకుల పాఠశాలలో ఏకరూప దుస్తులను పరిశీలించారు. జిల్లాలోని 52,264 మంది విద్యార్థులకు ఈ దుస్తులు అందజేయడం జరుగుతుందన్నారు. జూన్ 5లోగా స్వయం సహాయక సంఘాల ద్వారా విద్యార్థులకు అందజేయాలని సూచించారు.

కొనుగోలు కేంద్రం సందర్శన

మంజులాపూర్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. ధాన్యం కొనుగోళ్లు నిరంతరం చేపట్టాలని ఆదేశించారు. కేంద్రాల వద్ద రైతులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వారికి తాగునీరు, టెంట్, తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు. వివరాలు రోజువారీగా ట్యాబ్‌లో నమోదు చేయాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలుంటాయన్నారు. డీఈవో రవీందర్ రెడ్డి, చేనేత శాఖ ఏడీ రమ్య, సీఎంవో ప్రవీణ్, సివిల్ సప్లయిస్ డీఎం శ్రీకళ, తదితర అధికారులు కలెక్టర్ వెంట ఉన్నారు.

టీఎస్ స్థానంలో టీజీగా మార్పు చేయాలి

టీఎస్ స్థానంలో టీజీగా మార్పు చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేషన్లు, ఏజెన్సీలు, స్వయం ప్రతిపత్తి సంస్థలు ప్రభుత్వం సంస్థలన్నీ ఇకనుండి టీజీగా ప్రారంభమయ్యేలా మార్చుకోవాలని సూచించారు. ప్రభుత్వ వెబ్‌సైట్లు, ఆన్‌లైన్ నివేదికలు, నోటిఫికేషన్లు, తదితర ఉత్తర ప్రత్యుత్తరాలు అన్ని శాఖల కార్యకలాపాలు టీజీగా మార్పు జరుపాలన్నారు. ఈ మేరకు తీసుకున్న చర్యలపై 25లోగా నివేదికలు అందజేయాలని సూచించారు.

కొనుగోళ్లను వేగవంతం చేయాలి

నిర్మల్ అర్బన్ : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వరి ధాన్యం కొనుగోళ్లపై సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఈ నెల 31లోగా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా త్రాగునీరు. టెంట్ సౌకర్యం కల్పించాలని, వర్షాల వలన ధాన్యం తడవకుండా అవసరమైన టార్పాలిన్లు, గన్ని బ్యాగ్స్ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. రైతుల వారీగా కొనుగోళ్లు, సాగు విస్తీర్ణం, ధాన్యం వివరాలను నిర్వాహకులు ప్రతి రోజు ట్యాబ్ ఎంట్రీ చేయాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులు కేంద్రాలను నిరంతరం పర్యవేక్షించాలని, కొనుగోలు చేసిన ధాన్యం వెంట వెంటనే మిల్లులకు తరలించాలని సూచించారు. అనంతరం కేంద్రాల వారీగా కొనుగోళ్లు, ట్యాబ్ ఎంట్రీ తదితర అంశాలపై కలెక్టర్ చర్చించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, డీఆర్డీవో విజయలక్ష్మి, డీఎస్‌వో శ్రీకళ, జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, డీసీవో నర్సయ్య, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మే వారిపై పీడీయాక్ట్

అరికట్టేందుకు ప్రత్యేక టీముల ఏర్పాటు నకిలీ విత్తనాల రవాణా.. విక్రయాలపై నిఘా : ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్ కల్చరల్, మే 21 : జిల్లాలో నకిలీ విత్తనాలు అరికట్టేందుకు పోలీసు శాఖ ఉక్కుపాదం మోపనున్నట్లు ఎస్పీ జానకిషర్మిల తెలిపారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో నకిలీ విత్తనాల రవాణా, విక్రయాలపై గట్టి నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. లాభాల కోసం రైతులకు నకిలీ విత్తనాలు అమ్మి సొమ్ము చేసుకునే అక్రమార్కుల పైన పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం, డీజీపీ ఆదేశాల మేరకు నకిలీ విత్తనాలు అరికట్టేందుకు ప్రత్యేక పోలీసు బృందాలు ఏర్పాటు చేస్తున్నామని స్పష్టం చేశారు. నకిలీ విత్తనాలు అమ్మినట్లు తేలితే కఠినంగా వ్యవహరించనున్నామన్నారు. రైతులను మోసం చేసే నకిలీ విత్తనాలు సరఫరా చేసే వారిని గుర్తించి నిఘా ఏర్పాటు చేస్తామని తెలిపారు. జిల్లాలోని ఎరువుల దుకాణాలు, గోడౌన్‌లను ఆకస్మికంగా తనిఖీ చేస్తామన్నారు. అనుమానం వచ్చిన విత్తనాలు శాంపిల్ సేకరించి పరీక్షలకు పంపుతామన్నారు. రవాణా వాహనాలను కూడా ఆకస్మిక తనిఖీ చేసి లైసెన్స్ లేకుండా వ్యాపారం చేసే వారిపై, విక్రయించే వారిపై కేసులు నమోదు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశామని పేర్కొన్నారు. రైతులకు ప్రతి పోలీసుస్టేషన్ పరిధిలో అవగాహన సమావేశాలు ఏర్పాటు చేసి మోసపోకుండా చైతన్యపరుస్తున్నామని స్పష్టం చేశారు. జిల్లాకు ఇతర రాష్ట్రాల నుండి నకిలీ విత్తనాలు రాకుండా సరిహద్దు ప్రాంతాల్లోని చెక్‌పోస్టుల వద్ద గట్టి నిఘా ఏర్పాటు చేశామన్నారు. సాంకేతికతను ఉపయోగించుకొని అక్రమ రవాణా జరిగే ప్రాంతాలను, మార్గాలను గుర్తించి ఆకస్మిక తనిఖీ చేయనున్నట్లు వెల్లడించారు. నకిలీ విత్తనాలు అక్రమ రవాణా, సరఫరా నిరోధించేందుకు ఇన్ఫార్మర్ వ్యవస్థ పటిష్టం చేసినట్లు తెలిపారు.

'ప్రభుత్వ నియమ నిబంధనలను అతిక్రమించరాదు'

భైంసా, మే 21 : పల్లెప్రాంతాల్లో ప్రథమ చికిత్సలు నిర్వహిస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీలు ప్రభుత్వ నియమ నిబంధనలను ఎలాంటి పరిస్థితుల్లోనూ అతిక్రమించరాదని ఆర్ఎంపీ, పీఎంపీల సంఘం జిల్లా అసోసియేషన్ కార్యదర్శి అమ్ములసాగర్ అన్నారు. మంగళవారం భైంసాలో నిర్వహించిన మండల, గ్రామీణా వైద్యుల సంక్షేమ సంఘం సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ నియమ నిబంధనలకు అనుగుణంగానే వ్యవహరించాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకునే విషయంలో తామే ఫిర్యాదు చేస్తామని వెల్లడించారు. ఇందులో భైంసా మండల గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం అధ్యక్షులు కదం అర్జున్, ఉపాధ్యక్షులు సునీల్, కార్యదర్శి సాయికుమార్, కోశాధికారి తుకారాం తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో ప్రవేశానికి

జూన్ 6లోగా దరఖాస్తు చేసుకోవాలి

నిర్మల్ కల్చరల్, మే 21 : బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో ప్రవేశాలకు విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు జూన్ 6 గడువని ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఒక ప్రకటనలో తెలిపారు. నిర్మల్ జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయంలో కలెక్టరేట్‌లో దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. గిరిజన బాలికలకు 3 తరగతిలో 10, 5వ తరగతిలో 5, 8 తరగతిలో 5 సీట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

ప్రైవేట్ కళాశాలపై

కేసు నమోదు చేయాలి : ఎస్ఎఫ్ఐ

నిర్మల్ కల్చరల్, మే 21 : నిర్మల్ పట్టణంలోని ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాల యాజమాన్యం విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేస్తూ మాస్ కాపీయింగ్ ప్రోత్సహిస్తోందని ఎస్ఎఫ్ఐ ఆరోపించింది. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో కాకతీయ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తుండగా విద్యార్థుల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు జిల్లా కార్యదర్శి దిగంబర్ ఆరోపించారు. జిల్లా కలెక్టర్, వీసీ స్పందించి చర్య తీసుకోవాలని కోరారు.

సైబర్ నేరాలపై గ్రామస్థులకు అవగాహన

సారంగాపూర్, మే 21 : మండలంలోని చించోలి (ఎం)లో గ్రామస్తులకు మంగళవారం సైబర్ నేరాలపై ఎస్సై చంద్రమోహన్ అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్లు పలు రకాల పద్ధతిలో డబ్బులను కాజేస్తున్నారని, వాటిపై జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. అలాగే వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని వాహన చోదకులతో పేర్కొన్నారు. వాహన ధ్రువ పత్రాలతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికలు శాంతియుతంగా జరిగేలా ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ అవగాహన సదస్సులో పోలీసు సిబ్బంది, గ్రామస్థులు ఉన్నారు.

ఆలూర్ గ్రామాభివృద్ధి కమిటీ ఏర్పాటు

సారంగాపూర్, మే 21 : మండలంలో గల ఆలూర్ గ్రామాభివృద్ధి కమిటీ ఏర్పాటు చేశారు. ఈ గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులుగా పతాని నర్సయ్య, ఉపాధ్యక్షులుగా గుండ్ల రవి, కార్యవర్గ సభ్యులుగా చిన్నయ్య, భూమేష్, సాయినాథ్, సాయన్న, లక్ష్మీనారాయణ, లక్ష్మణ్, రమేష్, రమణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

చదువుతోనే ప్రగతి

భైంసా, మే 21 : నేటి పోటీతత్వ యుగంలో చదువుతోనే ప్రగతి సాధ్యమవుతుందని మోహన్‌రావ్ ప్రజా ట్రస్టు చైర్మెన్ బోస్లే మోహన్‌రావ్ పాటిల్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని అల్ఫోర్స్ పాఠశాలలో పది ఫలితాల్లో 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు ట్రస్టు ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమం నిర్వహించి జ్ఞాపికలతో సత్కరించారు. ఈ సందర్భంగా ట్రస్టు చైర్మెన్ బోస్లే మోహన్‌రావ్‌పాటిల్ మాట్లాడుతూ జీవిత లక్ష్యసాధనకు ప్రణాళికబద్ధంగా ముందుకు సాగాలన్నారు. సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఇందులో ట్రస్టు ప్రతినిధులు సుభాష్ జాదవ్, రామకృష్ణ (ఆర్కే), పది జీపీఏ సాధించిన విద్యార్థులు, వారి తల్లితండ్రులు పాల్గొన్నారు.











ఆలయాలపై దేవాదాయ శాఖ సమీక్ష

- దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖతో పాటు కార్యదర్శి శైలజ రామయ్యర్, కమిషనర్ హన్మంత్‌రావు హాజరు
- ఎలక్షన్ కోడ్ అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా భారీగా బదిలీలు ?
- ఆలయ ఈవోల నుంచి నివేదిక స్వీకరణ
- ఆలయ భూముల కౌలు, లీజుపై చర్చ


హైదరాబాద్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పక్కన ఎండోమెంట్ కార్యదర్శి


హాజరైన వివిధ ఆలయాల ఈవోలు

బాసర, మే, 21: ఎన్నికల కోడ్ అనంతరం దేవాదాయ శాఖలో భారీగా బదిలీలు జరగనున్నాయి. ఈ మేరకు దేవాదాయ శాఖ రాష్ట్ర అధికారులు రాష్ట్రంలోని దేవాలయాల ఈవోల నుంచి నివేదికలు తెప్పించుకున్నారు. దీర్ఘకాలంగా ఒకేచోట పనిచేస్తున్న ఉద్యోగులకు స్థానచలనం కల్పించనున్నారు. మంగళవారం హైదరాబాద్ బొగ్గుల కుంట దేవాదాయ శాఖ రాష్ట్ర కార్యాలయంలో సమీక్ష సమావేశం జరిగింది. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖతో పాటు ఆ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, కమిషనర్ హన్మంత్‌రావు పాల్గొన్న ఈ సమావేశంలో ఆలయాల పరిస్థితిపై చర్చించినట్లు తెలిసింది. ముఖ్యంగా ఏండ్ల తరబడి ఒకేచోట పనిచేస్తున్న ఉద్యోగులపై అనేక ఫిర్యాదులు వెళ్లాయి. ముథోల్ నియోజకవర్గ స్థాయి పార్టీ కాంగ్రెస్ పార్టీ కీలక నాయకులు బాసర దేవస్థానంలో దీర్ఘకాల ఉద్యోగులను స్థాన చలనం చేయాలంటూ కమిషనర్‌కు ఫిర్యాదు ఇచ్చారు. ఒక బాసర ఆలయం ఒకటే కాదు ఇతర ఆలయాల ఉద్యోగులపై అనేక ఫిర్యాదులు ఉన్నాయి. ఈ క్రమంలో బదిలీ చేయాలని అధికారులు నిర్ణయించినట్లు తెలిసింది. ఎలక్షన్ కోడ్ ముగియగానే వెంటనే బదిలీలు చేపట్టాలని మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. అదేవిధంగా అవినీతి ఆరోపణలు ఉన్న అధికారులను కూడా స్థానచలనం కల్పించాలని అధికారులు భావిస్తున్నారు. బాసర ఆలయంలో 20 ఏళ్లకు పైగా బదిలీ లేకుండా ఇక్కడే పనిచేస్తున్న ఉద్యోగులు వారి వివరాలపై నివేదిక సమర్పించినట్లు బాసర ఆలయ ఈవో విజయరామారావు తెలిపారు. ఒకేచోట రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగులందరికి బదిలీలు జరిగే అవకాశం ఉంది.

ఆలయ భూముల లీజుపై చర్చ

దేవాలయాల భూములు, వాటి పరిరక్షణకు చేపడుతున్న చర్యల గురించి సమావేశంలో చర్చించారు. సాగు భూములయితే కౌలు వసూలు గురించి ఆరా తీశారు. వ్యాపార లీజులు, వసూళ్లు, బకాయిల గురించి మంత్రి, ఉన్నతాధికారులు ఆరా తీశారు. ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా ఎప్పటికప్పుడు తగు చర్యలు తీసుకోవాలని ఆలయాల అధికారులకు సూచించారు.







ఇళ్ల నిర్మాణం

పూర్తయ్యాకే పంపిణీ చేస్తాం

- ఆక్రమించిన ఇళ్లు ఖాళీ చేసి వెళ్లాలి
- లేదంటే కేసులు తప్పవు
- తహసీల్దార్ బి. స్వామి హెచ్చరిక


లబ్ధిదారులను ఇళ్లు ఖాళీ చేయాలని హెచ్చరిస్తున్న తహసీల్దార్

దిలావర్‌పూర్, మే 21 : చట్ట విరుద్ధంగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ఆక్రమించిన వారు వెంటనే ఇళ్లు ఖాళీ చేసి వెళ్లాలని తహసీల్దార్ బి. స్వామి అన్నారు. మంగళవారం పోలీస్, పంచాయతీ రాజ్ అధికారులతో కలిసి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు వెళ్లి ఆక్రమించిన లబ్ధిదారులతో మాట్లాడారు. అయితే మాకు ఉండటానికి ఇళ్లు లేవని, మాకు ఇళ్లు మంజూరైనా పంపిణీ చేయడంలో మూడేళ్లుగా జాప్యం ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. మమ్మల్ని చంపేసినా మేము ఇక్కడి నుంచి కదిలేది లేదని భీష్మించారు. కాదని మమ్మల్ని బలవంతం చేస్తే ఇక్కడే ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు. దీంతో కొంత గందరగోళ పరిస్థితి నెలకొంది. తహసీల్దార్ స్వామి మాట్లాడుతూ... మీరు ఇలా ఇళ్లు ఖాళీ చేయకుండా మొండికేస్తే క్రిమినల్ కేసులు తప్పవని హెచ్చరించారు. మాపై ఎన్ని కేసులైనా పెట్టుకోండి ఖాళీ చేసేది లేదని లబ్ధిదారులు బదులిచ్చారు. దీంతో నిర్మల్ రూరల్ సీఐ శ్రీనివాస్ జోక్యం చేసుకుని ఇలా అనుమతి లేకుండా ఇళ్లను ఆక్రమించడం సరికాదని, ఇళ్లు మంజూరైన వారందరికీ ఎన్నికల కోడ్ ముగిశాక తప్పకుండా పంపిణీ చేస్తారని అప్పటి వరకు ఓపిక పట్టాలని కోరారు. ఇలా చెబుతూనే మూడేళ్లు గడిచిపోయాయని, ఇంకెన్నాళ్లు ఎదురు చూడాలని ప్రశ్నించారు. మీరు ఇళ్లు ఖాళీ చేసి వెళ్తే మీకే మంచిదని, తర్వాత మీకు ఇళ్లు వస్తాయని, అలా కాకుండా మొండికేస్తే తిరిగి ఇళ్లు రాకపోగా మీపై కేసులు పెడితే ఇబ్బంది పడతారని నచ్చజెప్పారు. దీంతో మెత్తబడ్డ లబ్ధిదారులు కోడ్ ముగిశాక తిరిగి ఇళ్లను మాకే అప్పగించాలని కోరారు. తహసీల్దార్ స్వామి మాట్లాడుతూ... ఇళ్ల నిర్మాణం ఇంకా అసంపూర్తిగా ఉన్నాయని, ఇంకా కొన్ని ఇళ్లు నిర్మించాల్సి ఉందన్నారు. ఇళ్ల నిర్మాణం పూర్తయ్యాక తప్పకుండా అర్హులైన లబ్ధిదారులందరికీ పంపిణీ చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఎస్సై సుమాంజలి లబ్ధిదారులతో ప్రత్యేకంగా మాట్లాడి వారిని ఒప్పించి ఇళ్లను ఖాళీ చేయించారు. అనంతరం లబ్ధిదారులు తమ తమ సామాగ్రి, బట్టలు, వంట సామాన్లు తీసుకొని ఇళ్లను ఖాళీ చేసి వెళ్లారు. లబ్ధిదారులను ఒప్పించి ఇళ్లను ఖాళీ చేయించేందుకు అధికారులు సుమారు ఆరు గంటల పాటు కష్టపడ్డారు. చివరికి వారు ఇళ్లు ఖాళీ చేయడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.


ఇంటి ముందు బైఠాయించిన లబ్ధిదారులు



రాజీవ్‌గాంధీకి ఘన నివాళి

● ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా ఘనంగా 33వ వర్ధంతి వేడుకలు ● పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు

ఆదిలాబాద్ అర్బన్, మే 21: అనేక సంస్కరణలతో దేశాన్ని ముందుకు నడిపించిన మేధావి రాజకీయ వేత్త మాజీ ప్రధాని, భారతరత్న స్వర్గీయ రాజీవ్‌గాంధీ అని కాంగ్రెస్ నేతలు కొనియాడారు. మంగళవారం పట్టణంలోని కంది శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయం ప్రజాసేవాభవన్‌లో రాజీవ్ 33వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వర్ధంతి కార్యక్రమానికి పెద్దఎత్తున కాంగ్రెస్ శ్రేణులు, ఎన్ఎస్ యూఐ, యువజన కాంగ్రెస్, మహిళ కాంగ్రెస్ నేతలు క్యాంపు ఆఫీస్‌కు చేరుకుని రాజీవ్‌గాంధీ చిత్ర పటం వద్ద పూలమాలలు వేసినివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు జైనథ్ జడ్పీటీసీ తుమ్మల అరుంధతి వెంకట్‌రెడ్డి, మావల ఎంపీపీ దర్శనాల సంగీత ఏవన్, మాజీ మున్సిపల్ చైర్మన్ దిగంబర్‌రావు పటేల్, పట్టణ అధ్యక్షుడు గుడిపెల్లి నగేష్, కౌన్సిలర్లు కలాల శ్రీనివాస్, ఆవుల వెంకన్న, దర్శనాల లక్ష్మణ్, జాఫర్ అహ్మద్, గిమ్మ సంతోష్, లోక ప్రవీణ్‌రెడ్డి, డి.శ్రీలేఖ, అన్నపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్: దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని ఉట్నూర్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. భారతదేశాన్ని అనేక రంగాల్లో అభివృద్ధి చేసిన ధృవతార దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ ఆశయాలను నేరవేరుద్దామని కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీకి నివాళులర్పించిన సందర్భంగా డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ లింగంపల్లి చంద్రయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇక్బాల్‌లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్సీసెల్ నాయకులు దూటరాజేశ్వర్, మాజీ సర్పంచ్ ఆత్రంరాహుల్, అచ్చదేవనందం, నాయకులు భీమన్నఅర్షాద్‌బాయ్, కలీం, మూతి గంగాధర్, మహబూబ్, అరకిల్ల పరమేశ్వర్‌రావ్, యూసఫ్‌బాయ్, మేస్రం నగేష్, జుబేర్‌ఖాన్, అబ్రార్, కలీం, తదితరులు పాల్గొన్నారు.


ప్రజాసేవా భవన్‌లో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

● 'రాజీవ్ సేవలు మరువలేనివి'

మావల: ఐటీ రంగాన్ని దేశానికి పరిచయం చేసి విప్లవాత్మక మార్పులు తెచ్చిన ఘనత రాజీవ్ గాంధీకే దక్కుతుందని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. పార్లమెంట్ అభ్యర్థి సుగుణతో కలిసి మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యువజన జిల్లా అధ్యక్షులు చరణ్ గౌడ్, మావల మండల అధ్యక్షుడు ధర్మపూరి చంద్రశేఖర్, సిరికొండ మండల్ అధ్యక్షులు షేక్ ఇమామ్, యువజన జిల్లా ఉపాధ్యక్షులు వేముల నాగరాజు, నలిమేలా నవీన్ రెడ్డి, కొరటి ప్రభాకర్, అడెల్లు, తదితరులు పాల్గొన్నారు.

● 'యువతకు ప్రాధాన్యతనిచ్చిన ప్రధాని'

బోథ్: భారతదేశ దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ దేశం కోసం ఎన్నో కార్యక్రమాలను చేపట్టారన్నారు. పంచాయితీ రాజ్ వ్యవస్థను మున్సిపల్ వ్యవస్థను ఏర్పాటు చేయడంతో పాటు అట్టడుగు వర్గాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే విధంగా ఆయన కృషి చేశారన్నారు. ముఖ్యంగా యువతకు ఓటు హక్కు కల్పించాలని దృక్పథంతో 21 సంవత్సరాలు వయసు ఉంటే 18 సంవత్సరాలు కుదించి యువతకు ప్రాధాన్యతనిచ్చారన్నారు. దేశ ఆర్థిక అభివృద్ధికి పారిశ్రామిక అభివృద్ధికి ఎంతో కృషి చేశారని పలువురు పేర్కొన్నారు. దేశం కోసం 40 సంవత్సరాల వయసులోని ప్రాణాలర్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, స్థానిక ఎంపీటీసీలు కురుమే మహేందర్, షేక్ రజియా బేగం, వర్కింగ్ ప్రెసిడెంట్ మహ్మద్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి చంటి, ఏఎంసీ డైరెక్టర్లు అబ్రాస్, మాజీ వార్డు సభ్యులు శేఖర్, షేక్ షాకీర్, మైనారిటీ వైస్ ప్రెసిడెంట్ రహీముద్దీన్, పట్టణ అధ్యక్షుడు అబ్దుల్, తదితరులు పాల్గొన్నారు.


రాజీవ్‌గాంధీ చిత్రపటానికి ఘన నివాళులర్పిస్తున్న ఆత్రం సుగుణ

గుడిహత్నూర్: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాల్యాల కరుణాకర్ మాట్లాడుతూ దేశంలో సాంకేతిక విప్లవానికి నాంది పలికింది రాజీవ్ గాంధీనే అన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాల సరసన భారతదేశాన్ని నిలిపిన ఘనత ఆయనదేనని గుర్తుచేశారు. దేశంలో పేదరికాన్ని పారద్రోలి సమసమాజ స్థాపనకు కృషి చేశాడన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు అరీఫ్‌ఖాన్, నాయకులు నరేష్, గోవింద్, సురేష్, అహ్మద్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.


ఉట్నూర్‌లో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


బోథ్‌లో రాజీవ్‌గాంధీ వర్ధంతిలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు


గుడిహత్నూర్‌లో నివాళులర్పిస్తున్న పార్టీ నాయకులు


పల్లకీలో లక్ష్మీనరసింహ స్వామి మూర్తిని ఊరేగిస్తున్న దృశ్యం

వడ్డాడిలో మహా శోభాయాత్ర

తాంసి, మే 21: హిరణ్యకశ్యపుడి బారి నుంచి ప్రహ్లాదుడిని రక్షించడానికి నృసింహుడు అవతరించిన రోజు కావటంతో మంగళవారం తాంసి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలోప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ పూజారి విశాల్ వేదమంత్రాల నడుమ హోమం, అభిషేకాలు, హారతి, వంటి శాస్త్రోక్తంగా నిర్వహించారు. అదేవిధంగా మనుమాన్ భక్తుల ఆధ్వర్యంలో హనుమాన్ శోభా యాత్రను నిర్వహించారు. గ్రామంలోని పుర వీధుల్లో హనుమాన్, నరసింహ స్వామి పల్లకీలను ఊరేగించారు. జై హనుమాన్, జై శ్రీరామ్, హరి నామ స్మరణలతో ఆలయం మార్మోగింది.

'పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు'

తాంసి, మే 21: వచ్చే జూన్ నెలలో ప్రారంభం కానున్న పాఠశాలలో ప్రత్యేక వసతులు కల్పించనున్నట్లు ఎంపీడీవో గడ్డం మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని జామిడి, బండల నాగపూర్ గ్రామాలలో ఉన్న పాఠశాలలను ఆయన పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి సౌకర్యాలు కల్పించారో ఆరా తీశారు. ముఖ్యంగా విద్యార్థులకు నీటి వసతితో పాటు గాలి సౌకర్యం కల్పించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పచ్చని చెట్లు పెంచేలా చూడాలని సూచించారు. విద్యార్థులకు మరుగుదొడ్ల సదుపాయాన్ని కల్పించాలని అన్నారు. ఉపాధ్యాయులు వారివారి విధులను బాధ్యతగా నిర్వహిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని అన్నారు.

చికిత్స పొందుతూ ఉపాధి కూలీ మృతి

తలమడుగు, మే 21: మండలంలోని సుంకిడి గ్రామానికి చెందిన అంబాటి కిష్టన్న(58) ఉపాధి హామీ కూలీ వడదెబ్బ తాకి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు.ఈసందర్భంగా కుటుంబీకులు మాట్లాడుతూ సుంకిడి గ్రామానికి అంబాటి క్రిష్ణ గత నెల 25న ఉపాధి హామీ పనులకు వెళ్లి వడదెబ్బకు గురికావడంతో కుటుంబ సభ్యులు ఆయనను చికిత్స నిమిత్తం 108లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడని కుటుంబీకులు తెలిపారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.


ఎంపీడీవో కార్యాలయం వద్ద వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సీఎస్సీ సిబ్బంది

కార్మికుల కోసం ప్రత్యేక వైద్య శిబిరం

బోథ్, మే 21: రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల కోసం ప్రత్యేకమైన వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని సీఎస్సీ జిల్లా కో ఆర్డినేటర్ సయ్యద్ ఫర్వేజ్ పేర్కొన్నారు. మంగళవారం బోథ్ ఎంపీడీవో కార్యాలయం ఎదుట వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కార్మికుల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్మికులు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ముందుగా సమాచారం ఇచ్చిన తరువాతనే శిబిరాలు నిర్వహిస్తామన్నారు. యువకులు కార్మిక సంఘాల నాయకులు శిబిరాల విజయవంతం చేసేందుకు సహకరించాలని పేర్కొన్నారు. బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఎ ఖాదర్, సూఫీ, క్యాంప్ కో ఆర్డినేటర్‌తో పాటు సీఎస్సీ హెల్త్ కేర్ అండ్ వెల్నెస్ సెంటర్ ఇన్‌చార్జీ రషీద్, తదితరులు పాల్గొన్నారు.

అంతర్‌రాష్ట్ర రహదారిపై రోడ్డుప్రమాదం

● బాలుడి మృతి.. బోయర్ జగదీశ్‌కు తీవ్రగాయాలు

జైనథ్, మే 21: మండలంలోని పౌజ్‌పూర్ గ్రామ సమీపంలో గల అంతర్ రాష్ట్ర రహదారిపై ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని నిరాల గ్రామానికి చెందిన పవార్‌కృష్ణ (11) అనే బాలుడు మృతి చెందాడు. దీంతో పాటు అదే గ్రామానికి చెందిన బోయర్ జగదీశ్ (38) కాలు విరిగి పోగా తలకు ముఖానికి తీవ్రగాయాలు అయ్యాయి. ఎస్సై వి.పురుషోత్తం కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఏపీ25 ఏజే0090 నెంబర్ గల కారు బోరజ్ నుంచి మండలంలోని నిరాల గ్రామానికి అతివేగంగా వెళ్తుంది. పీఎస్04 ఈఎఫ్5540 నెంబర్ గల ట్రాక్టర్ బోరజ్ నుంచి మండలంలోని హాశింపూర్ గ్రామానికి పర్టిలైజర్ లోడ్‌తో వెళ్తుంది. వెనుక నుంచి వస్తున్న కారు అతివేగంగా ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో ట్రాక్టర్ బోల్తాపడింది. కారులో ఉన్న బోయర్ అరవింద్ పవార్‌కృష్ణ, అనే బాలుడు కారులో ఇరుక్కుపోగా స్థానిక ఫౌజ్ గ్రామ ప్రజలు పోలీసులు వారిద్దరిని బయటకు తీసి చికిత్స నిమిత్తం 108 ద్వారా ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో రిమ్స్ వైద్యులు హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. దీంతో పవార్‌కృష్ణ అనే బాలుడు హైదరాబాద్ గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతు సోమవారం ఉదయం మరణించాడు. బోయర్ అరవింద్ గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈరోడ్డు ప్రమాదానికి సంబంధించిన ఫిర్యాదు ఇప్పటి వరకు జైనథ్ పోలీసు స్టేషన్ వారి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయలేదని రూరల్ సీఐ సాయినాథ్, ఎస్సై వి.పురుషోత్తంలు తెలిపారు.


ఫౌజ్‌పూర్ రోడ్డు ప్రమాదంలో బోల్తాపడిన ట్రాక్టర్

పెన్షన్ అక్రమాలపై విచారణ చేపట్టాలి

భైంసా, మే 21 : తమ గ్రామంలో పెన్షన్ పంపిణీలో చోటు చేసుకున్న అక్రమాలపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని భైంసా మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన పలువురు డిమాండ్ చేశారు. ఈ మేరకు సంబంధిత విషయంలో మంగళవారం ఎంపీడీవో సుధాకర్ రెడ్డికి లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు. తమ కుటుంబ సభ్యులు మరణించినప్పటికి వారి పేర్లపై పెన్షన్ డబ్బులు పంపిణీ జరిగిందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

అందకూర్‌లో అగ్నిప్రమాదం

కుంటాల, మే, 21 : మండలంలోని అందకూర్ గ్రామంలో మంగళవారం అగ్నిప్రమాదం సంభవించింది. రాజరపు ఎర్రన్న రేకుల షెడ్డులో పాత ఇంటి కట్టెలను, ఇతర సామాగ్రిని ఉంచారు. గ్రామపంచాయతీ సిబ్బంది గ్రామంలో సేకరించిన చెత్తకు నిప్పుపెట్టిన సందర్భంలో ప్రమాదవ శాత్తు రేకుల షెడ్డుకు నిప్పంటుకొని అందులో ఉన్న సామాగ్రి దగ్ధమైంది. పరిస్థితిని గమనించిన స్థానికులు అప్రమత్తమై మంటలు ఆర్పారు. ఈ ప్రమాదంలో రూ.50 వేల వరకు ఆస్తినష్టం వాటిల్లిందని బాధితుడు పేర్కొన్నారు.

బరంపూర్ కొండపై శ్రీనివాస కల్యాణం

● గోవింద నామస్మరణతో మార్మోగిన ఆలయం

తలమడుగు, మే 21: మండలంలోని బరంపూర్ కొండపై స్వయంభుగా వెలిసిన శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో వార్షికోత్సవం సందర్భంగా కన్నులపండుగ వైభవంగా శ్రీనివాస కళ్యాణాన్ని వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు కేదరేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ బరంపూర్ కొండపై వెలసిన శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయానికి దశాబ్దాల చరిత్ర ఉందన్నారు. భక్తుల గ్రామస్థుల సహకారంతో దాదాపు రూ.5కోట్ల వ్యయంతో ఆలయాన్ని పునర్ నిర్మించి నూతన విగ్రహ ప్రతిష్టాపన స్థాపించి భక్తుల సహకారంతో రెండో వార్షికోత్సవం నిర్వహించడం జరిగిందన్నారు. గోదాదేవి సమేతంగా శ్రీనివాస కల్యాణం నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. భక్తుల సహకారంతో గత కొన్ని సంవత్సరాల నుంచి ప్రతీ శనివారం వెయ్యి మంది భక్తులకుపైగా అన్నదానం భజన కార్యక్రమం స్వామివారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. భక్తులు ప్రజా ప్రతినిధులు, అధికారుల సహకారంతో ఈ ఆలయాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేసిన అన్నారు. అనంతరం వేద పండితులతో శ్రీనివాస కల్యాణాన్ని నిర్వహించి స్వామివారికి ప్రత్యేక అభిషేక కార్యక్రమం చేపట్టారు. భజన బృందాలతో సంస్కృతిక సాంప్రదాయ కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం ఆలయంలో అన్నదానం చేపట్టారు. ఇందులో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు బరకం మల్లేష్, ప్రతాప్ నాగరెడ్డి, రాజు, శ్రీనివాస్, ఎంపీటీసీ రంజిత్‌రెడ్డి, ఉప సర్పంచ్ నారాయ ణరెడ్డి, సామాజిక కార్యకర్త రమాకాంత్, నవీన్‌గౌడ్, వేద పండితులు కల్యాణ్‌కుమార్, తిరునగిరి స్వస్తిక్ స్వామి, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.


స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు


పెద్దసంఖ్యలో హాజరైన భక్తులు

యువత క్రీడల్లో రాణించాలి : ఎమ్మెల్యే అనిల్

ఇచ్చోడ, మే 21: నచ్చిన క్రీడను ఎంచుకొని యువత క్రీడల్లో రాణించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండల కేంద్రంలో గత 15 రోజులుగా నిర్వహిస్తున్న ఇచ్చోడ ప్రిమియర్ లీగ్ క్రికెట్ పోటీలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఫైనల్ క్రీడా పోటీల్లో గెలుపొందిన జట్టుకు ఎమ్మెల్యే అనిల్ జాదవ్ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, ఎంపీటీసీలు శివారెడ్డి, సుభాష్, నాయకులు రమేష్, పాండురంగ్, ఫిర్దోస్‌ఖాన్, అనిల్, సాయిరాం, దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● ఎన్‌పీఎల్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే

నేరడిగొండ: మండల కేంద్రంలో గత ఐదు సంవత్సరాల నుంచి ఎన్‌పీఎల్ (నేరడిగొండ ప్రీమియర్ లీగ్) క్రికెట్ మ్యాచ్‌లు జరుగుతున్నాయి. ఈ క్రికెట్ పోటీలకు బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గత ఐదు సంవత్సరాల నుంచి ఈ పోటీలలో పాల్గొనే వందల మంది క్రీడాకారులను, వారి ప్రతిభను ప్రోత్సహిస్తున్న అనిల్ జాదవ్‌ను క్రీడాకారులు అందరు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అనిల్ జాదవ్ మాట్లాడుతూ క్రీడాకారులంతా తమదైన శైలిలో ఆటలాడి ప్రతిభను చాటి జిల్లాస్థాయి రాష్ట్ర స్థాయి, దేశావళి క్రికెట్లో ఆడాలన్నారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులకు ఇది ఒక వరమని, దీని వల్ల తమప్రతిభ చూపించుకోవచ్చన్నారు.ఆర్థికంగాసామాజికంగా వెనుకబడిన కుటుంబాల పిల్లలకు మంచి అవకాశమని దీనిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఆటలాడడం వల్ల ఉల్లాసం,స్నేహభావం దేహదారుఢ్యం మానసిక ప్రశాంతత లభిస్తాయని అన్నారు. ఇందులో తెలంగాణ రాష్ట్ర అధ్యాపక సంఘం ప్రధాన కార్యదర్శి బలరాంజాదవ్, ఎంపీపీ రాథోడ్‌సజన్,వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, మండల నాయకులు తదితరులున్నారు.

● 'సంప్రదాయాలను మరవకూడదు'

బోథ్: బంజారాలు ప్రతి యేటా వర్షా కాలానికి ముందు జరుపుకునే దసరా పండుగను సాంప్రదాయబద్దంగా జరుపుకోవాలని ఎ మ్మెల్యే జాదవ్అనిల్ కోరారు. మంగళవారం మండలంలోని రఘునాథ్‌పూర్ గ్రామంలో నిర్వహించిన పండుగ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన సాంప్రదాయాలను మరవకుండా ప్రతి కార్యక్రమాన్ని నిర్వహించుకోవాలన్నారు. పూర్వీకులు చూపించిన సాంప్రదాయాలను పాటించాలని కోరారు. ఇందులో నేరడిగొండ ఎంపీపీ సజన్లాల్, బోథ్ మండల నాయకులు మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్, ఆత్మ మాజీ చైర్మన్ సుభాష్ మల్లెపూల, పలువురు నాయకులు పాల్గొన్నారు.


ఇచ్చోడలో విజేత జట్టుకు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్


బంజారా దసరా పండుగ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే, నాయకులు

ఖానాపూర్ 6వ వార్డు కౌన్సిలర్ రాజీనామా

● కమిషనర్ మతతత్వంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణ

ఖానాపూర్, మే 21 : ఖానాపూర్ మున్సిపల్ ఆరో వార్డు కౌన్సిలర్ అఫ్రిన్ బేగం అమానుల్లా ఖాన్ మంగళవారం రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, కమిషనర్ మనోహర్ గౌడ్‌లకు అందజేశారు. తమ రాజీనామా లేఖను జిల్లా కలెక్టర్‌కు సైతం పంపించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... స్థానిక మున్సిపల్ కమిషనర్ మతతత్వంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రోడ్డు పక్కన కొంత మంది వ్యక్తులు ఆక్రమణలు చేస్తుంటే వాటిని తొలగించేలా చర్యలు చేపట్టాలని కమిషనర్ దృష్టికి తీసుకువచ్చానన్నారు. కౌన్సిలర్ ఫిర్యాదు చేస్తే క్షేత్రస్థాయిలో సమస్యను పరిశీలించి పరిష్కరించాల్సిన అధికారి నాలుగో వార్డుకు చెందిన కౌన్సిలర్‌ను పిలిపిస్తానని మీరు కూడా వచ్చి వారితో మాట్లాడాలని చెబుతున్నారన్నారు.

బీజేపీకి చెందిన నాలుగో వార్డు కౌన్సిలర్ కాంగ్రెస్‌కు చెందిన తనను ఎదురెదురుగా కూర్చోబెట్టి సమస్యపై మాట్లాడించి కమిషనర్ మా ఇద్దరి మధ్యలో వివాదాలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. మైనారిటీ సామాజిక వర్గానికి చెందిన కౌన్సిలర్‌గా ఉన్న తాను బీజేపీ కౌన్సిలర్‌తో వివాదాలకు పోతే ఖానాపూర్‌లో మత ఘర్షణలు తలెత్తే అవకాశముందని ఆవేదన వ్యక్తం చేశారు. క్షేత్ర స్థాయిలో సమస్యలు పరిష్కరించాల్సిన అధికారి హోదాలో ఉన్న కమిషనర్ కౌన్సిలర్ నేరుగా సమస్యలు పరిష్కరించుకోవాలని చెప్పడం సరికాదన్నారు. కమిషనర్ వ్యవహార శైలికి నిరసనగా తాను రాజీనామా చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.


కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ కిషోర్‌కుమార్

ధాన్యం బస్తాల

తరలింపులో అలసత్వం చేయవద్దు

● నిర్మల్ రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ కిషోర్ కుమార్

లోకేశ్వరం, మే 21 : వరి కొనుగోలు కేంద్రాలలో నిల్వ ఉన్న బస్తాలను ఎప్పకటిప్పుడు మిల్లులకు తరలించాలని నిర్మల్ జిల్లా రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ కిషోర్ కుమార్ నిర్వాహకులను ఆదేశించారు. మంగళవారం మండలంలోని నగర్, గడ్‌చందాలో నిర్వహిస్తున్న వరి కొనుగోలు కేంద్రాలను స్థానిక అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తూకం వేసిన బస్తాలను తరలింపులో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. సెంటర్‌లో ఉన్న ధాన్యాన్ని పూర్తి చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. తహసీల్దార్ మోతిరాం, ఆర్ఐ బాలకిషన్, తదితరులు ఉన్నారు.

నిర్మల్‌లో రాజీవ్‌గాంధీ వర్ధంతి


రాజీవ్‌గాంధీకి నివాళులర్పిస్తున్న నాయకులు

నిర్మల్ కల్చరల్, మే 21 : నిర్మల్ జిల్లా కేంద్రంలో స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలు మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, నాయకులు అల్లూరి మలారెడ్డి, నాందేడపు చిన్ను, బురాజ్, ఎంబడి రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

జనగామ జిల్లాకు పాపన్నగౌడ్ పేరు పట్ల హర్షం

నిర్మల్ కల్చరల్, మే 21 : జనగామ జిల్లాను పాపన్న గౌడ్ పేరుగా మారుస్తున్నందుకు సీఎం రేవంత్ రెడ్డికి మోకుదెబ్బ రాష్ట్ర కమిటీ హర్షం ప్రకటించింది. మంగళవారం జాతీయ అధ్యక్షుడు అమరవేణి నర్సాగౌడ్, సెక్రటరీ జనరల్ రాగుల సిద్ధిరాములు గౌడ్ నిర్మల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ... సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ భారతదేశ మొట్టమొదటి దళిత బహుజన విప్లవ వీరుడన్నారు. గోల్కొండ కోటను జయించిన మహారాజు అని తెలిపారు. జనగామ జిల్లాకు పాపన్న గౌడ్ జిల్లాగా నామకరణం చేయాలని పోరాడామన్నారు. సీఎం గౌడజన ఆత్మ గౌరవాన్ని గుర్తించి నిర్ణయించడం అభినందనీయమన్నారు. ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. బాలరాజ్ గౌడ్, బాలసాని సురేష్ గౌడ్, రమేష్ గౌడ్, నర్సింలు, వెంకన్న, శ్రీనివాస్, రవి గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

గోదావరిలో పడి ఒకరు మృతి

బాసర, మే, 21 : బాసర వద్ద పుణ్యస్నానాలకని నదిలో దిగిన ఓ భక్తుడు నీట మునిగి మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. బాసర పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్ర నాందెడ్ జిల్లా చక్లూర్ గ్రామానికి చెందిన కృష్ణ పటేల్, కామారెడ్డికి చెందిన ఆయన బావ శ్రీహరితో కలిసి మంగళవారం బాసరకు వచ్చారు. అమ్మవారి దర్శనం కంటే ముందు నది స్నానానికని గోదావరి తీరానికి వెళ్లారు. గోదావరిలో స్నానమచరిస్తుండగా కృష్ణ పటేల్ ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడు. పోలీసులు గ జ ఈతగాళ్లతో సుమారు 6 గంటల పాటు గాలించి మృతదేహాన్ని వెలికి తీశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు బాసర ఎస్సై గణేష్ తెలిపారు.

మైనారిటీ బాలికల రెసిడెన్షియల్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

ముథోల్, మే 21 : ముథోల్ మండల కేంద్రంలోని తెలంగాణ మైనార్టీ బాలికల రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరముకు గాను అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ అర్జుమాన్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఆంధ్రజ్యోతి

andhrajyothy.com మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 41.3 ; కనిష్ఠం 30.7

ఆదిలాబాద్
జిల్లా వార్తలు

5

బుధవారం 22 మే 2024





జిల్లాకేంద్రంలో ఫర్టిలైజర్ దుకాణం ముందు బారులు తీరిన రైతులు



● విత్తనాల కోసం క్యూలైన్‌లో నిలబడలేక నేలపై కూర్చున్న మహిళా రైతులు



● విత్తనాల కోసం వచ్చి నీడలో సేదతీరుతున్న రైతులు

పత్తి రైతుల.. పాట్లు!

- జిల్లాలో పత్తి విత్తనాల కోసం ఫర్టిలైజర్ దుకాణాల ముందు రైతుల పడిగాపులు
- పత్తి విత్తనాల కోసం పెద్దఎత్తున బారులు తీరుతున్న రైతులు
- పలుచోట్ల విత్తనాలు లేవంటూ నో స్టాక్ బోర్డులు దర్శనం
- కృత్రిమ కొరతను సృష్టిస్తూ.. మాయ చేస్తున్న వ్యాపారులు
- 10 లక్షల ప్యాకెట్లకు గానూ.. అందుబాటులో 5.6 లక్షలు మాత్రమే..
- తొలకరికి ముందే చేతులెత్తేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు
- జిల్లావ్యాప్తంగా ఈ యేడు 4.16 లక్షల ఎకరాలలో పత్తి పంట సాగవుతుందని అధికారుల అంచనా

ఆదిలాబాద్, మే 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రధానంగా సాగయ్యే పత్తి విత్తనాల కోసం రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. ఈ యేడు 4లక్షల 16వేల 969 ఎకరాలలో పత్తి పంట సాగవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీనికి గాను 10లక్షల 42వేల 422 పత్తి విత్తన ప్యాకెట్లు అవసరమని అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. జిల్లాలో మే చివరిలోనే పత్తి, సోయా పంటలను సాగు చేస్తారు. దీననుగుణంగా విత్తన ప్యాకెట్లను అందుబాటులో ఉంచాల్సిన అధికారులకు ముందుచూపు లేకపోవడంతో అన్నదాతలకు ఇబ్బందులు తప్పడం లేదు. గతేడు పత్తి విత్తనాల కొరత ఏర్పడడంతో అన్నదాతలు రోడ్డెక్కే పరిస్థితి ఏర్పడింది. ఈసారి కూడా అధికార యంత్రాంగం అప్రమత్తం కాక పోవడంతో అవే పరిస్థితులు పునరావృతమవుతున్నాయి. సీడ్ ప్రొడక్షన్ లేక పోవడంతోనే విత్తన కొరత ఏర్పడుతుందని చెబుతున్నారు. ఏదో పొంతన లేని సమాధానాలు చెబుతు అధికారులు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా పత్తి విత్తనాలను అందుబాటులో ఉంచాల్సిన అధికారులు ఆ దిశగా ముందస్తు చర్యలు తీసుకోక పోవడమే ఈ పరిస్థితికి కారణమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా మార్కెట్లో రాశి-659 వెరైటీ విత్తనాలకు భారీ డిమాండ్ ఏర్పడింది. దీంతో రైతులు క్యూ కట్టి విత్తనాలను కొనుగోలు చేసే పరిస్థితి ఏర్పడుతుంది. తొలకరికి ముందే విత్తన షాపుల ముందు నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. రైతులు ముందు చూపుతో అవసరమైన విత్తనాలను కొనుగోలు చేసుకుం టూ నిల్వ చేసుకుంటున్నారు. రాబోయే రోజుల్లో పత్తి విత్తనాల కొరత ఏర్పడుతుందన్న ఉద్దేశంతోనే రైతులు విత్తనాలను కొనుగోలు చేసేందుకు ఎగ బడుతున్నారు. అయితే తొలకరికి ముందే అధికారులు చేతులేత్తేయడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడుతున్నారు.

బ్లాక్ మార్కెట్‌లో అధిక రేటు

జిల్లాలో రాశి-659 పత్తి విత్తనాలకే ఎక్కువగా డిమాండ్ కనిపిస్తుంది. కానీ కొంత మంది వ్యాపారులు డిమాండ్ ఉన్న విత్తనాల కొరతను సృష్టిస్తూ అధిక ధరలకు అమ్మేసుకుంటున్నట్లు తెలుస్తుంది. 475 గ్రాముల రాశీ-659 విత్తన ప్యాకెట్ రూ.864 ధర పలుకుతుంది. కానీ బ్లాక్ మార్కెట్‌లో రూ.1200ల నుంచి రూ.1300ల వరకు విక్రయిస్తున్నట్లు సమాచారం. అలాగే మహారాష్ట్రలో రాశి- 659 పత్తి విత్తనాలను నిషేధించడంతో అక్కడి రైతులు జిల్లా నుంచే వేల విత్తన ప్యాకెట్లను కొనుగోలు చేసి తీసుకెళ్తనట్లు తెలుస్తుంది. పొరుగు రాష్ట్రానికి తరలిపోతున్న పత్తి విత్తనాలకు అడ్డుకట్ట వేయడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారనే ఆరోపణలు వస్తున్నాయి. టాస్క్‌ఫోర్స్ కమిటీల పనితీరుపై విమర్శలు లేకపోలేదు. ఈ యేడు జిల్లాకు లక్షా 20వేల రాశి-659 విత్తన ప్యాకెట్లు అవసరమని అధికారులు గుర్తించగా ఇప్పటి వరకు 18వేలు మాత్రమే సరఫరా అయినట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తుంది. ఇందులో సగానికి పైగా విత్తన ప్యాకెట్లు బ్లాక్‌మార్కెట్‌కు తరలి పోయినట్లు చెబుతున్నారు. సరిపడా విత్తనాలు లేకపోవడంతో ఎమ్మార్పీ ధర కంటే అధిక ధరలకు అమ్ముకుంటున్నట్లు తెలుస్తుంది. వ్యాపారులతో కుమ్మక్కవుతున్న కొందరు అధికారులు అడ్డుకునే ప్రయత్నం చేయడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి.

సరఫరా అయ్యింది సగమే..

జిల్లాలో పత్తి సాగు విస్తీర్ణానికి అనుగుణంగా విత్తన ప్యాకెట్లను అందుబాటులో ఉంచాల్సిన అధికారులు.. ఆ దిశగా చర్యలు చేపట్టినట్లు కనిపించడం లేదు. ఇప్పటి వరకు సగం పత్తి విత్తనాలు మాత్రమే జిల్లాకు సరఫరా అయినట్లు తెలుస్తుంది. జిల్లావ్యాప్తంగా 4లక్షల 16వేల 969 ఎకరాలలో పత్తి పంట సాగు కాగా, అన్నిరకాల పత్తి విత్తన ప్యాకెట్లు 10లక్షల 42వేల 422 అవసరమని అధికారులు గుర్తించారు. కాని ఇప్పటి వరకు 5లక్షల 6వేల విత్తన ప్యాకెట్లు మాత్రమే జిల్లాకు చేరడంతో తీవ్రమైన కొరత ఏర్పడుతుంది. ఇందులో ప్రధానంగా రాశి-659 విత్తనాలకు భారీ డిమాండ్ ఉండడంతో రైతులు విత్తనాల కోసం బారులు తీరుతున్నారు. ఇదంతా అధికారులకు ముందే తెలిసినా క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించిన దాఖలాలు కనిపించడం లేదు. రైతుల డిమాండ్‌కు అనుగుణంగా విత్తన ప్యాకెట్లను ముందే అందుబాటులో ఉంచితే ఈ పరిస్థితి తలెత్తేది కాదన్న వాదనలు వినిపిస్తున్నాయి. ప్రతియేటా ఇవే పరిస్థితులు ఎదురవుతున్న అధికారుల తీరులో మాత్రం మార్పు కనిపించడం లేదని రైతులు పేర్కొంటున్నారు. దశల వారీగా విత్తన ప్యాకెట్లు వస్తాయని అధికారులు చెబుతున్నా.. రైతుల్లో మాత్రం ఆందోళన కనిపిస్తుంది. ఇన్నాళ్లు అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉన్నాయని గొప్పలు చెప్పిన వ్యవసాయ శాఖాధికారు లు రైతుల ఆందోళనలతో ముఖం చాటేస్తున్నారు. విత్తన కంపెనీల తప్పిదమం టూ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. పత్తి పంట సాగులో సుదీర్ఘ అనుభ వం ఉన్న రైతులు అధిక దిగుబడులను ఇచ్చే పత్తి విత్తనాలను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. క్షేత్రస్థాయిలోకి వెళ్లకుండానే అధికారులు పంటల ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తుంది. ముందుగానే రైతుల డిమాండ్‌ను అంచనా వేసి ఉంటే ఇబ్బందులు తప్పేవన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతియేటా ఏదో రకమైన ఇబ్బందులతో పంటల సాగుకు రైతులు సిద్ధమవుతున్నా అధికారులు మాత్రం పరిష్కార మార్గం చూపేందుకు ప్రయత్నించడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి.



డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తి లేకపోవడమే..

: శివకుమార్, ఏవో, ఆదిలాబాద్

రైతుల డిమాండ్‌కు అనుగుణంగా పత్తి విత్తనాల ఉత్పత్తి (ప్రొడక్షన్) లేకపోవడంతో కొరత ఏర్పడుతుంది. ముఖ్యంగా రాశి-659 విత్తనాలకు డిమాండ్ ఉంది. ప్రత్యామ్నయంగా అధిక దిగుబడులను ఇచ్చే ఇతర కంపెనీల పత్తివిత్తనాలు అందుబాటులో ఉన్న రైతులు ఆసక్తి చూపడం లేదు. త్వరలోనే మరిన్ని విత్తన ప్యాకెట్లను సరఫరా చేస్తాం. తొలకరికి ముందే అవసరమైన విత్తనాలను అందుబాటులో ఉంచుతాం. జిల్లాలో ప్రస్తుతం 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో విత్తనాలను విత్తుకోవడం మంచిది కాదు. పత్తి పంట సాగుకు ఇంకా సమయం ఉంది. రైతులు ఇప్పుడే తొందరపడవద్దు. రైతుల అవసరం మేరకు పత్తి విత్తనాలు అందే విదంగా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం.

'ఆదిమ గిరిజన విద్యార్థులకు ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు'

ఉట్నూర్, మే 21: ఉమ్మడి జిల్లాలోని ఆదిమ గిరిజన తెగలకు చెందిన తోటి, కోలాం, కోలవార్ విద్యార్థిని విద్యార్థులు 2022-23, 2023-24 విద్యా సంవత్సరాలలో పదవ తరగతి ఉత్తీర్ణులైన వారు ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ కోర్సులలో తెలంగాణ ప్రతిభ కళాశాలలో హయత్ నగర్, హైదరాబాద్‌లలో ప్రవేశాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్త ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఐటీడీఏ కార్యాలయంలోని గురుకులాల రీజినల్‌కో ఆర్డినేటర్ సంప్రదించాలని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన ఆదిమ గిరిజన విద్యార్థినీ, విద్యార్థులు మెమో, బోనఫైడ్, టీసీ, కులఆదాయ ధ్రువీకరణ పత్రాలు, నాలుగు ఫొటోలతో రెండు జతల జిరాక్స్ కాగితాలతో ఫిజికల్ ఫిట్‌నెస్, ఆధార్ సర్టిఫికెట్లు జత చేసి దరఖాస్తు చేసుకోవాలని ఐటీడీఏ పీవో పేర్కొన్నారు.

కల్తీ విత్తనాలను అరికట్టాలని వినతి

ఆదిలాబాద్ అర్బన్, మే 21: వామపక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో నాణ్యమైన విత్తనాలను రైతులకు అందించాలని, కల్తీ విత్తనాలు, బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలని కలెక్టర్‌కు మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వామపక్ష రైతు సంఘాల నాయకులు బండి దత్తాత్రి, చిల్కు దేవిదాస్, బి. వెంకటనారాయణ, బి.జగన్‌సింగ్‌లు మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 4 లక్షలు ఎకరాల్లో పత్తి పంట సాగవుతుందన్నారు. దాదాపు పది లక్షల విత్తన సంచులు రైతులకు అవసరమవుతాయని, కానీ వ్యాపారులు నాసిరకం, కల్తీ విత్తనాలను అంటగట్టే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

'బీసీ కుల గణన తర్వాతే స్థానిక ఎన్నికలు'

బోథ్, మే 21: రాష్ట్ర ప్రభుత్వం బీసీ కుల గణన జరిపిన తర్వాతే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని విశ్వకర్మ విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు, మున్నూరు కాపు సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దార్ సుభాష్‌చంద్రకు ఈ విషయమై వినతిపత్రం ఇచ్చారు. బీసీ కుల గణన జరగక ముందు ఎన్నికలు నిర్వహిస్తే బీసీలు నష్టపోతారన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా విశ్వ బ్రాహ్మణ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మున్నూరు కాపు సంఘం నాయకులు మాజీ ఆత్మ చైర్మన్ మల్లెపూల సుభాష్, నాయకులు నాయి బ్రాహ్మణ సంఘం టౌన్ ప్రెసిడెంట్ నవీన్, రజక సంఘం జనరల్ సెక్రటరీ రమణ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద..

నిరంతరం అప్రమత్తంగా ఉండాలి

● రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ రాజార్షిషా ● టీటీడీసీ, పాల్‌టెక్నిక్, గురుకుల కళాశాలల్లో సిబ్బంది భద్రత తీరు పరిశీలన



సీసీ కెమెరాల పనితీరును పరిశీలిస్తున్న రిటర్నింగ్ అధికారి



స్ట్రాంగ్‌రూమ్ వద్ద రిజిస్టర్‌లో సంతకం చేస్తూ..

ఆదిలాబాద్ అర్బన్, మే 21: ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద ఉన్న భద్రత సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి జిల్లా కలెక్టర్ రాజార్షిషా తెలిపారు. మంగళవారం స్థానిక టీటీడీసీ, సంజయ్ గాంధీ పాల్‌టెక్నిక్ కళాశాల, సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాలలో ఏర్పాటు చేసిన 7అసెంబ్లీ సెగ్మెంట్‌లకు సంబంధించిన ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద పోలీసు భద్రతను, సీసీ కెమెరాల పనితీరును, పోలీస్ సిబ్బంది విధుల నిర్వహణను ఆయన పరిశీలించి, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రత కట్టుదిట్టంగా ఉండాలని, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

కౌంటింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్ల పరిశీలన

ఆదిలాబాద్ అర్బన్: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి స్థానిక టీటీడీసీలో ఏర్పాటు చేసిన ఆదిలాబాద్, బోథ్ కౌంటింగ్ కేంద్రాలను రిటర్నింగ్ అధికారి రాజార్షిషా మంగళవారం సహాయ రిటర్నింగ్ అధికారి ఖుష్బు గుప్త, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఎన్నికల సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జూన్ 4న జరుగనున్న కౌంటింగ్ ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్నిచర్యలు చేపట్టాలన్నారు. పరిసర ప్రాంతాలలో వాహనాల పార్కింగ్, కౌంటింగ్ హాజరయ్యే ప్రభుత్వ సిబ్బంది పోటీలో ఉన్న అభ్యర్థులు కౌంటింగ్ ఏజెంట్లు ఇతర సిబ్బంది, కౌంటింగ్ ఏడు అసెంబ్లి నియోజక వర్గాల కౌంటింగ్ కేంద్రాల వద్ద తాగునీరు, టాయిలెట్స్, అన్ని మౌళిక సదుపాయాలు, మీడియా పాయింట్, సైన్స్‌బోర్డ్స్, సీసీ కెమెరాల ఏర్పాటు, తదితర ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.



కౌంటింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ రాజార్షిషా

వడ్‌గావ్‌లో పెర్సాపేన్‌కు పూజలు

ఇంద్రవెల్లి, మే 21: వైశాఖ మాసాన్ని పురస్కరించుకుని ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసీ గిరిజన గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఆదివాసీ వంశాల వారీగా పెర్సాపేన్ (పెద్ద దేవుడు), గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా మంగళవారం మండలంలోని వడ్‌గావ్ గ్రామంలో కోర్‌కార్ ఆత్రం వంశస్థులు పెర్సాపేన్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గ్రామంలోని ఆదివాసీ సంప్రదాయ వాయిద్యాలు వాయిస్తూ పెర్సాపేన్ ఆలయంలో సంప్రదాయ పూజలు చేసి గ్రామం చుట్టూ పూజలు చేస్తూ ప్రదక్షిణలు చేసి కటోడ (పూజారి) ఆత్రం షేకు ఇంట్లో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్యాలలు, పుట్నాలు, కానుకలు వేసి మొక్కులు సమర్పించారు. గ్రామ సమీపంలోని పవిత్రమైన మడుగు వద్ద గంగా స్నానం ఆచరించారు. రాత్రి పేర్సపేన్ దేవుడికి మహాపూజ నిర్వహించారు. అనంతరం వారు తీసుకువచ్చిన నైవేద్యాన్ని దేవతలకు సమర్పించి అక్కడే సహపంక్తి భోజనాలు చేశారు. అదేవిధంగా ఈతంతు ముగిసిన తరు వాత రాత్రి డోలు తదితర వాయిద్యాలను వాయిస్తూ ఆగ, మగా అంతా కలిసి డేంసా నృత్యాలు చేశారు. ఈ ఏడాది వర్షాలు బాగా కురవాలని, పంటలు సమృద్ధిగా పండాలని, పిల్లాపాపలను చల్లగా చూడాలని, ఆదివాసీ దేవతలను వేడుకున్నారు. ప్రతి ఏడాది ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోందని కటోడ ఆత్రం షేకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్రం వంశీయులు ఆత్రం శంకర్, ఆత్రం మారుతి, ఆత్రం మనోహర్, ఆత్రం హనుమంత్, ఆత్రం సీతారాం, ఆత్రం సంతోష్, తదితరులు పాల్గొన్నారు.





కానుకలు సమర్పిస్తున్న మహిళలు (ఇన్‌సెట్‌లో గ్రామంలో ప్రదక్షిణలు చేస్తున్న ఆదివాసీలు



ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలతో మాట్లాడుతున్న పీడీ సాయన్న

ఉపాధి హామీలో అక్రమాలను అరికట్టే బాధ్యత కూలీలదే : డీఆర్డీఏ పీడీ

తలమడుగు, మే 21: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అవినీతి అక్రమాలను అరికట్టే బాధ్యత కూలీలదేనని ఉపాధి హామీ పనులకు వస్తున్న ప్రతి కూలికి రూ.300 కూలీ కల్పించే బాధ్యత అధికారులదేనని డీఆర్డీఏ పీడీ సాయన్న కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని రుయ్యాడి చెరువులో చేపడుతున్న ఉపాధి హామీ పనులను ఆయన అకస్మీకంగా తనిఖీ చేశారు.ఈ సందర్బంగా పీడీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత కూలీలకు వేసవి కాలంలో ఉపాధి కల్పించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి ఉపాధి పని కల్పించాలన్నారు. ఉపాధి హామీ పథకంలో 52రకాల పనులు ఉన్నాయని,వాటిలో రైతులకు కూలీలకు ఉపయోగపడే పనులు చేపట్టాలని సూచించారు.మండలంలో ఎంత మందికిజాబ్‌కార్డులు ఉన్నాయి. ఎంత మంది పనిలోకి వస్తున్నారు, వాటి వివరణ అడిగి తెలుసుకున్నారు. మండలంలో దాదాపు పదివేల మందికి జాబ్‌కార్డులు ఉండగా మండలంలో ప్రతిరోజు దాదాపు 3700మంది పనులకు వస్తున్నారని,ఎంపీడీఓ రాజశేఖర్, పీజీఎస్ ఏపీఓ మేఘమాల విన్నవించారు. ప్రతికూలికి రూ.300 కూలి కల్పించేలా పనులు కల్పించాలన్నారు. అంతేకాకుండా పనులు జరుగుతున్న ప్రదేశాల్లో మౌళిక వసతులు కల్పించాలన్నారు. నీడ సౌకర్యం తాగునీటి సౌకర్యం ప్రథమ చికిత్స కోసం మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. అంతేకాకుండా కూలీలు ఎండలు ఎక్కువ ఉన్నందున ఉదయం పూట పనులకువెళ్లాలని కోరారు.అనంతపూర్ రుయ్యాడి చెరువులో చేపడుతున్న చేపలకుంట పనులను, పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ఇందులో ఎంపీడీఓ రాజశేఖర్,ఏపీ మేఘమాల, పంచాయతీ సెక్రటరీ అభయ్ కుమార్, ఈసీ ప్రవీణ్‌కుమార్, టెక్నికల్ అసిస్టెంట్ స్వామి, స్వరాజ్యం,లక్ష్మీ, ఫీల్డ్‌అసిస్టెంట్ బాలాజి,కూలీలు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

'నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు'

గుడిహత్నూర్, మే 3: నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై సయ్యద్ ఇమ్రాన్, మండల వ్యవసాయ శాఖ అధికారిణి డి.రేవతి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఉన్న ఫర్టిలైజర్ షాపుల్లో పోలీసు వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని ఫర్టిలైజర్ దుకణాదారులకు సూచించారు. నకిలీ విత్తనాలు అమ్మితే వారి డీలర్‌షిప్‌ను రద్దు చేస్తామని హెచ్చరించారు. ప్రతి షాప్‌లో విత్తనాల ధరలు, స్టాక్‌కు సంబంధించిన బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే లైసెన్స్‌లను రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో రైతు, డీలర్ సంతకంతో కూడిన రసీదులు ఇవ్వాలన్నారు. ఎమ్మార్పీ ధరల కంటే అధిక ధరలకు విక్రయించవద్దని హెచ్చరించారు. అనుమతి లేని పత్తి విత్తనాలు, గడ్డి విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.



గుడిహత్నూర్‌లో స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఎస్సై, ఏవో